# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను
http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో
వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 | సంచిక : 296 | మంగళవారం 11 జూన్ 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


## నెలాఖరులోగా కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలు?

### పూర్తయిన క్షేత్రస్థాయి అధ్యయనం
### ప్రభుత్వ ఆదేశాలు రాగానే పెంపు




హైదరాబాద్

రాష్ట్రంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. భూముల విలువ సవరణపై ఇప్పటికే క్షేత్రస్థాయి అధ్యయనం పూర్తయిందని రిజిస్ట్రేషన్ శాఖ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం నిర్ణయం తీసుకొని, ఆదేశిస్తే వెంటనే పెంపుదల అమలు చేస్తామని చెబుతున్నారు. ఈ నెలాఖరులోగా ఆదేశాలు రావొచ్చని, దాదాపు 20-40 శాతం - మిగతా3లో

# గులాబీలో అంతర్మధనం

- అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 37.35 శాతం ఓట్లు
- ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలు 16.68 శాతం ఓట్లు మాత్రమ వచ్చాయి.
- ఐదు నెలల కాలంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఓట్లు 21 శాతం పక్క పార్టీలకు వెళ్లిపోయాయి.
- బీఆర్ఎస్ పార్టీ శరవేగంగా కరిగిపోతోంది. ఆ బలాన్ని బీజేపీ అందుకుంటోంది



హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 37.35 శాతం ఓట్లు వచ్చాయి. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలు 16.68 శాతం ఓట్లు మాత్రమ వచ్చాయి. అంటే ఐదు నెలల కాలంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఓట్లు 21 శాతం పక్క పార్టీలకు వెళ్లిపోయాయి. అందులో కొంత కాంగ్రెస్.. అత్యధికంగా బీజేపీ పొందాయి. అంటే బీఆర్ఎస్ పార్టీ శరవేగంగా కరిగిపోతోంది. ఆ బలాన్ని బీజేపీ అందుకుంటోంది. దీనికి కారణం బీఆర్ఎస్‌కు బలమైన ఓటు బ్యాంక్ లేకపోవమే అనుకోవచ్చు. రాజకీయ పార్టీ బలంగా ఉంది అని చెప్పుకోవాలంటే అందరూ చూసే ఒకే ఒక్క పాయింట్ ఆ పార్టీకి ఎంత ఓటు షేర్ ఉంది అనే. ఈ ఓటు షేర్ అనేది రాజకీయ వ్యవహారిక భాషలో ఓటు బ్యాంక్ అని చెప్పుకోవచ్చు. పార్టీకి నిజాయితీగా ఓట్లు వేసే ఓటర్లు ఎంత ఎక్కువ మంది ఉంటే వారందర్నీ ఓటు బ్యాంక్ అనుకోవచ్చు. ఓటు బ్యాంక్ ఉన్న పార్టీకే విలువ ఉంటుంది. ఈ ఓటు బ్యాంక్ ను రాజకీయ పార్టీలు వివిధ పద్దతుల్లో క్రియేట్ చేసుకుంటూ ఉం?యి. కులం, మతం, ప్రాంతం , భావోద్వేగ అంసాల ఆధారంగా సృష్టించుకుంటాయి. ప్రస్తుతం అత్యధిక పార్టీల ఓటు బ్యాంక్ కులమే. ప్రస్తుతం దేశంలో అయినా రాష్ట్రాల్లో అయినా రాజకీయ పార్టీలు బలంగా - మిగతా3లో

# టీపీసీసీకి త్వరలో కొత్త అధ్యక్షుడు!

- ఎంపికపై పార్టీ అధిష్ఠానం దృష్టి
- పరిశీలనలో ఉత్తమ్, భట్టి?
- బీసీ నేత వైపే సీఎం రేవంత్ మొగ్గు!
- బడ్జెట్ తర్వాతే మంత్రివర్గ విస్తరణ?



హైదరాబాద్

టీపీసీసీకి త్వరలో కొత్త అధ్యక్షుడు రాబోతున్నారు. ఈ మేరకు అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇ చ్చినట్టు తెలిసింది. మంత్రివర్గ విస్తరణ మాత్రం మరికొంత ఆలస్యం అయ్యే అవకాశం ఉన్నట్టు సమాచారం. బడ్జెట్ సమావేశాల తర్వాత మంత్రివర్గ విస్తరణకు అధిష్ఠానం సముఖత వ్యక్తం చేసినట్టు ఆ పార్టీ వర్గాల సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి తన రెండు రోజుల ఢిల్లీ - మిగతా3లో



## మంత్రులకు శాఖలు కేటాయింపు

- టీడీపీ యువ ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడికి పౌర విమానయాన శాఖ
- కిషన్ రెడ్డికి బొగ్గుల, గనుల శాఖ కేటాయింపు
- బండి సంజయ్‌కి హోం శాఖ సహాయమంత్రి బాధ్యత

## విద్యపై ఖర్చులోఎక్కువ భాగం
# టీచర్ల జీతాలకే

- త్వరలో విద్యాకమిషన్‌ను ఏర్పాటు చేస్తాం
- స్కూల్ సిలబస్ ఎప్పటికప్పుడు మారుస్తాం
- సింగిల్ టీచర్ స్కూళ్లను మూసివేయం
- పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి



హైదరాబాద్

విద్యపై ప్రభుత్వం పెట్టే ఖర్చులో ఎక్కువ మొత్తం టీచర్ల జీతాలకే వెళ్తున్నదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఒక్కో విద్యార్థిపై ఏటా రూ.80 వేలు ఖర్చు చేస్తున్నామని, ఒక్కో టీచర్‌కు రూ.60 వేల నుంచి 80 వేల వరకు జీతాలిస్తున్నామని చెప్పారు- మిగతా3లో



# రుణమాఫీకి విధివిధానాలు!

- రూపొందించాలంటూ అధికారులకు సీఎం ఆదేశం
- ఆగస్టు 15 లోగా రుణమాఫీ చేసి తీరాల్సిందే
- బ్యాంకుల నుంచి రైతుల వివరాలు సేకరించండి
- నాలుగు రోజుల్లో ప్రతిపాదనలు పంపండి
- వ్యవసాయ శాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్

రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15లోపు రుణమాఫీ చేసి తీరాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులతో అన్నారు. ఇందుకు సంబంధించి వెంటనే విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు. పంట రుణమాఫీ, ఇతర అంశాలపై వ్యవసాయ, సహకార శాఖ అధికారులతో ముఖ్యమంత్రి సోమవారం సమీక్ష నిర్వహించారు. రైతు రుణమాఫీ పథకం అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రూ.2 లక్షల వరకు రుణాలు ఉన్న రైతుల జాబితాను సిద్ధం చేయాలని, పూర్తి స్థాయిలో బ్యాంకర్ల నుంచి రైతుల వివరాల్ని సకరించి అర్హులను గుర్తించాలని సూచించారు. కటాఫ్ తేదీ విషయంలో సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కేవలం బ్యాంకుల నుంచే కాకుండా, పీఏసీఎసల నుంచి పంట రుణాలు తీసుకున్న రైతుల వివరాలను కూడా అందుబాటులో ఉండేలా చూడాలని పేర్కొన్నారు. రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేసేందుకు పూర్తిస్థాయి వివరాలతోపాటు అవసరమైన అంచనా వ్యయాన్ని కూడా రూపొందించాలని, స్పష్టమైన ప్రణాళికతో ముందుకు రావాలని ఆదేశించారు. రుణమాఫీకి ఎన్ని నిధులు అవసరమవుతున్నాయో చూసుకొని ఆదాయ మార్గాలను అన్వేషించాలన్నారు. మూడు, నాలుగు రోజుల్లో ప్రతిపాదనలు పంపించాలని, కేబినెట్ ముందు పెట్టి చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని - మిగతా3లో

# మంత్రులకు శాఖలు కేటాయింపు

ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారధ్యంలో ఎన్డీఏ ప్రభుత్వం ముచ్చటగా మూడోసారి కొలువు దీరింది. 71 మంది మంత్రులతో ఆదివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణం చేయించారు. సోమవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ప్రధాని మోదీ.. మంత్రులకు శాఖలు కేటాయించారు. తెలంగాణలోని సికింద్రాబాద్ లోక్ సభా స్థానం నుంచి రెండోసారి గెలుపొందిన బీజేపీ నేత జీ కిషన్ రెడ్డికి బొగ్గు, గనుల శాఖ లభించింది. కరీంనగర్ నుంచీ రెండోసారి ఎన్నికైన బండి సంజయ్ కుమార్‌ను ప్రధాని మోదీ హోంశాఖ సహాయ మంత్రిగా నియమించారు. టీడీపీ నుంచి క్యాబినెట్ లోకి తీసుకున్న కింజారపు రామ్మోహన్ నాయుడుకు పౌర విమానయాన శాఖ, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌కు గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖల సహాయ మంత్రి, నర్సాపురం ఎంపీ భూపతి రాజు శ్రీనివాస వర్మకు భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి పదవులు లభించాయి.




### కిషన్ రెడ్డికి బొగ్గు, గనులశాఖ

సికింద్రాబాద్ ఎంపీ జీ కిషన్ రెడ్డికి బొగ్గు, గనులశాఖలను ప్రధాని మోదీ కేటాయించారు. ఇంతకుముందు పర్యాటక శాఖ మంత్రిగా పని చేశారు. దేశంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ తయారీకి అవసరమైన బొగ్గు సరఫరా చేయడం కిషన్ రెడ్డికి అతిపెద్ద సవాల్ కానున్నది. కోల్ గ్యాసిఫికేషన్, కోల్ బెడ్ మిథేన్ తయారీలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. దేశంలో విద్యుత్ ఉత్పత్తిలో బొగ్గు కీలక పాత్ర పోషిస్తుందని జీ కిషన్ రెడ్డి సోమవారం ఢిల్లీలో మీడియాతో చెప్పారు. తనపై ప్రధాని మోదీ పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు.

2019 ఎన్నికల్లో తొలిసారి సికింద్రాబాద్ లోక్ సభా స్థానం నుంచి గెలుపొందిన కిషన్ రెడ్డి, తాజా సార్వత్రిక ఎన్నికల్లోనూ సమీప కాంగ్రెస్ ప్రత్యర్థి దానం నాగేందర్‌పై 49 వేల పై చిలుకు ఓట్ల తేడాతో విజయం సాధించారు. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలో మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించిన కిషన్ రెడ్డి 1977 నుంచి సాధారణ కార్యకర్తగా బీజేపీలో రాజకీయాల్లోకి ప్రవేశించారు. బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, బీజేవైఎం జాతీయ అధ్యక్షుడిగానూ పని చేశారు. గత ప్రభుత్వంలో హోం, పర్యాటకం, సాంస్కృతికం, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖలను నిర్వహించారు. సికింద్రాబాద్ లోక్ సభా స్థానానికి ఎన్నికవ్వక ముందు 2004 నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి రెండుసార్లు, తెలంగాణ అసెంబ్లీకి ఒకసారి ఎన్నికయ్యారు.

### రామ్మోహన్‌కు విమాన యానం

పార్లమెంటుకు మూడుసార్లు ఎన్నికైన శ్రీకాకుళం ఎంపీ కింజారపు రామ్మోహన్ నాయుడుకు తొలిసారే కేంద్ర పౌర విమానయాన శాఖ అప్పగించారు. గత ప్రభుత్వంలో విమానయానశాఖ నిర్వహించిన జ్యోతిరాదిత్య సింధియాకు టెలీ కమ్యూనికేషన్ల శాఖ కేటాయించారు. కింజారపు రామ్మోహన్ నాయుడు.. ఏపీలో అధికారంలోకి వచ్చిన టీడీపీ నేత. 2024లో కేంద్రంలో బీజేపీ తిరిగి అధికారంలోకి రావడంలో బీజేపీ కీలక పాత్ర పోషించింది. శ్రీకాకుళం నుంచి మూడోసారి లోక్ సభకు ఎన్నికైన రామ్మోహన్ నాయుడు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కూడా ఉన్నారు. ఆయన తండ్రి ఎర్రన్నాయుడు తొలుత టెక్కలి నుంచి శాసనసభకు ఎన్నికవ్వగా, తదుపరి 1996 నుంచి 2004 మధ్య నాలుగు సార్లు శ్రీకాకుళం ఎంపీగా గెలిచారు. కేంద్రంలో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వ హయాంలో ఎర్రన్నాయుడు గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా పని చేశారు.

### బండికి హోంశాఖ సహాయ మంత్రి

కరీంనగర్ నుంచి రెండోసారి పార్లమెంటుకు ఎన్నికైన బండి సంజయ్ కుమార్‌ను ప్రధాని నరేంద్రమోదీ హోంశాఖ సహాయ మంత్రిగా నియమించారు. చిన్నప్పటి నుంచి ఆరెస్సెస్ కార్యకర్తగా పని చేస్తూ వచ్చిన బండి సంజయ్.. రెండు సార్లు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ గా గెలిచారు. 2014 , 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైనా 2019, 2024 లోక్ సభ ఎన్నికల్లో విజయం సాధించారు. అంతకుముందు 1994, 1999ల్లో కరీంనగర్ అర్బన్ సహకార బ్యాంకు డైరెక్టర్ గానూ గెలుపొందారు.

### పెమ్మసానికి గ్రామీణాభివృద్ధి.. కమ్యూనికేషన్లు..

గుంటూరు నుంచి తొలిసారి ఎంపీగా ఎన్నికైన టీడీపీ నేత పెమ్మసాని చంద్రశేఖర్ ను ప్రధాని నరేంద్ర మోదీ గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖల సహాయ మంత్రిగా నియమించారు. పెమ్మసాని చంద్రశేఖర్ వృత్తిరీత్యా వైద్యులు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎంసెట్ లో 27వ ర్యాంకుతో ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ విద్యనభ్యసించిన పెమ్మసాని.. పీజీ కోసం అమెరికాకు వెళ్లారు. గుంటూరు జిల్లా నుంచి సాధారణ వైద్యుడిగా వెళ్లిన పెమ్మసాని.. అమెరికాలో అనతి కాలంలోనే అంతర్జాతీయ గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన తండ్రి పెమ్మసాని సాంబశివరావు టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలోనే కొనసాగారు.

### భూపతిరాజుకు భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖలు

నర్సాపురం నుంచి తొలిసారి పార్లమెంట్ కు ఎన్నికైన భూపతి రాజు శ్రీనివాస వర్మను ప్రధాని నరేంద్రమోదీ భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖల సహాయ మంత్రిగా నియమించారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో పని చేసిన శ్రీనివాస వర్మ.. విశాఖలోని ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఎంఏ చేశారు. 2014లో తొలిసారి భీమవరం మున్సిపాలిటీ కార్పొరేటర్ గా ఎన్నికయ్యారు. 2024 ఎన్నికల్లో టీడీపీ-జనసేన మద్దతుతో నర్సాపురం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. కిషన్ రెడ్డికి గనులు.. రామ్మోహానుడికి విమానయానం..! కేంద్ర మంత్రివర్గంలో నియమితులైన జీ కిషన్ రెడ్డికి బొగ్గు, గనులశాఖ లభించగా, బండి సంజయ్ ని హోంశాఖ సహాయ మంత్రిగా ప్రధాని నరేంద్రమోదీ నియమించారు.

## ఫ్రాన్స్ పార్లమెంట్ రద్దు

**ఈయూ ఎన్నికల్లో మద్దతు కోల్పోడంతో**

**మేక్రాన్ 'ముందస్తు' నిర్ణయం**

**పారిస్ :** ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్.. పార్లమెంట్‌ను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. యూరోపియన్ యూనియన్ (ఈయూ) ఎన్నికల్లో విపక్ష పార్టీ నేషనల్ ర్యాలీ విజయం సాధిస్తుందన్న అంచనాల నేపథ్యంలో ఆదివారం అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ప్రజావిశ్వాసం మేరకు ఫ్రాన్స్ జాతీయ అసెంబ్లీకి ముందస్తు ఎన్నికలు నిర్వహించాలని మేక్రాన్ భావిస్తున్నారు. ఈయూ ఎన్నికల్లో మేక్రాన్‌పార్టీ రెనాయిసెన్స్‌కు 15 శాతం ఓట్లు, ప్రతిపక్ష నేషనల్ ర్యాలీ పార్టీకి సుమారు 32 శాతం ఓట్లు వస్తాయని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. అయితే దేశంలో తమ పార్టీ ప్రజా విశ్వాసం కోల్పోలేదని నిరూపించేందుకు మేక్రాన్ ముందస్తు ఎన్నికలకు పిలుపునిచ్చారు. "ఈ రోజు జాతీయ అసెంబ్లీని రద్దు చేస్తున్నా. ఈ నిర్ణయం చాలా పెద్దది. ప్రజాస్వామ్యం మీద ఉన్న నమ్మకంతో, భవిష్యత్ తరాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నా" అని మేక్రాన్ తెలిపారు. ఫ్రాన్స్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని మేక్రాన్ ప్రకటనపై ప్రతిపక్ష నాయకుడు జోర్డాన్ బార్డెల్లా వ్యాఖ్యానించారు. కాగా, ఎన్నికలను రెండు దశల్లో నిర్వహించనున్నట్లు ఫ్రాన్స్ అధ్యక్షుడు తెలిపారు. జూన్ 30న మొదటి దశ, జులై 7 చివరి దశ పోలింగ్ ఉంటుందని పేర్కొన్నారు.

## బీహార్ ఎన్నికల తర్వాత

# కేంద్రంలో కొత్త సర్కార్

**మోదీ 3.0 కేవలం అదానీ, అంబానీల కోసమే**

**కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాకూర్ సంచలన వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ:** ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన ఎన్డీయే సర్కార్‌పై కాంగ్రెస్ నాయకుడు, ఎంపీ మాణిక్కం ఠాకూర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన వెంటనే కేంద్రంలో ప్రభుత్వం మారిపోతుందని, 'ఇండియా కూటమి' నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటవుతుందని ఆయన జోస్యం చెప్పారు. మరికొద్ది నెలల్లో జరగనున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికలతో కేంద్రంలో సర్కార్ మారిపోతుందని తాము బలంగా నమ్ముతున్నామని చెప్పారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రివర్గ ప్రమాణస్వీకారంపై కీలక వ్యాఖ్యలు చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ మెజార్టీ మార్క్ అందుకోలేదని, అయినప్పటికీ ప్రధానిగా మోదీ నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారని విమర్శించారు. 'చంద్రబాబు, నితీశ్‌ల మద్దతుతో మోదీ, బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగారు. ఎన్డీయే సర్కార్ జీవితకాలం భాగస్వామ్య పక్షాల మద్దతుపై ఆధారపడింది. అదానీ, అంబానీల కోసం మోదీ ప్రభుత్వాన్ని నడుపుతారు. అదానీ, అంబానీల కోసమే మోదీ 3.0 ప్రభుత్వం పనిచేస్తుంది. ఈ నేపథ్యంలో బీహార్ ఎన్నికల తర్వాత కేంద్రంలో ప్రభుత్వం మారుతుంది' అని అన్నారు.

# క్యాబినెట్‌పై అసంతృప్తి సెగలు

**సహాయ మంత్రి కేటాయింపుపై**

**శివసేన పెదవి విరుపు**



**పుణే :** కేంద్రంలో ప్రధాని మోదీ నేతృత్వంలో కొత్తగా ఏర్పాటైన క్యాబినెట్ కూర్పుపై అసంతృప్తి సెగలు రేగుతున్నాయి. భాగస్వామ్య పక్షాలకు మంత్రి పదవులు కేటాయింపుపై శివసేన(షిండే వర్గం) తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. తమ కంటే తక్కువ ఎంపీ సీట్లు గెలుచుకొన్న ఇతర ఎన్డీయే పక్ష పార్టీలకు క్యాబినెట్ హోదా కలిగిన మంత్రి పదవులు కేటాయించి.. మహారాష్ట్రలో ఏడు లోక్‌సభ స్థానాలు గెలుచుకొన్న తమకు మాత్రం సహాయ మంత్రి పదవి ఇవ్వడంపై పెదవి విరిచింది. పదవుల కేటాయింపులో బీజేపీ పక్షపాతం చూపిందని శివసేన(షిండే) ఎంపీ శ్రీరంగ్ బర్నే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కనీసం క్యాబినెట్ హోదా మంత్రి పదవి దక్కుతుందని ఆశించామని అన్నారు. మరోవైపు లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క ఎంపీ సీటు గెలుచుకొన్న అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ కూడా మంత్రి పదవి కేటాయింపుపై వేచి చూసే ధోరణిలో ఉన్నట్టు కనిపిస్తున్నది.

### 15 స్థానాల్లో పోటీచేసి ఏడు గెలిచాం

ఐదు సీట్లు గెలిచిన చిరాగ్ పాశ్వాన్ పార్టీకి, రెండు సీట్లు గెలుచుకొన్న జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి, ఒక్క సీటు మాత్రమే గెలిచిన జితిన్ రాం మాంఝీకి క్యాబినెట్ పదవులు ఇచ్చారని శ్రీరంగ్ బర్నే ఈ సందర్భంగా పోలిక తెచ్చారు. ఎన్డీయే కూటమిలో జేడీయూ, టీడీపీ తర్వాత తమ పార్టీనే పెద్ద భాగస్వామి అని అన్నారు. మహారాష్ట్రలో 15 సీట్లలో పోటీచేసిన తాము ఏడు సీట్లలో విజయం సాధించామని, 28 స్థానాల్లో నిలిచిన బీజేపీ కేవలం తొమ్మిదింటిలో మాత్రమే గెలిచిందని ఆయన ఈ సందర్భంగా ఎత్తిచూపారు. బీజేపీ పాత మిత్రుడిగా ఉన్న శివసేనకు కేంద్ర మంత్రివర్గంలో ఒక క్యాబినెట్ హోదా మంత్రి, ఒక సహాయ మంత్రి పదవిని ఆశిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. మరో మూడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలను కలిసి ఎదుర్కోనున్న నేపథ్యంలో శివసేనకు తగిన గౌరవం దక్కుతుందని భావిస్తున్నామన్నారు. షిండే తీసుకొన్న నిర్ణయం వల్లే రాష్ట్రంలో అధికార మార్పు జరిగిందన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని బీజేపీ నుంచి తగిన వైఖరిని తాము ఆశిస్తున్నామని ఎంపీ శ్రీరంగ్ చెప్పారు.

## ఎమ్మెల్యేగా కల్పనా సోరెన్ ప్రమాణం..!



జార?ండ్‌లోని గండేయ్ అసెంబ్లీ స్థానం నుంచి ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో గెలుపొందిన కల్పనా సోరెన్ సోమవారం ఎమ్మెల్యేగా ప్రమాణం చేశారు. జార?ండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ సతీమణే కల్పనా సోరెన్. రాజ్ భవన్ లో జరిగిన కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ రవీంద్రనాథ్ మహతో ఆమెతో ఎమ్మెల్యేగా ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో సీఎం చాంపై సోరెన్, జేఎంఎం కీలక నేతలు పాల్గొన్నారు. గండేయ్ ఎమ్మెల్యే (జేఎంఎం) సర్ఫరాజ్ అహ్మద్ రాజీనామా చేయడంతో ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి దిలీప్ కుమార్ వర్మపై కల్పనా సోరెన్ 27 వేల ఆధిక్యంతో గెలుపొందారు. గత మార్చిలోనే ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. జార?ండ్ రాష్ట్రంలో విపక్ష ఇండియా కూటమి తరఫున కీలక నేతగా ఉన్న కల్పనా సోరెన్ రాకతో రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పులు జరుగుతాయని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇటీవల హేమంత్ సోరెన్ అరెస్టైన తర్వాత సీఎంగా ఆమెకు పగ్గాలు అప్పగిస్తారని ప్రచారం జరిగినా సీనియర్ నేత చాంపై సోరెన్.. సీఎంగా బాధ్యతలు చేపట్టారు.

## సుప్రీంకోర్టులో ఆమ్ ఆద్మీ పార్టీకి ఊరట..

## పార్టీ ఆఫీస్ 'ఖాళీ'కి గడువు పొడిగింపు



సుప్రీంకోర్టు లో ఆమ్ ఆద్మీ పార్టీ కి ఊరట లభించింది. ఢిల్లీలోని రౌస్ అవెన్యూ ఏరియాలో గల ఆప్ ప్రధాన కార్యాలయాన్ని ఖాళీ చేసేందుకు గతంలో విధించిన గడువును సుప్రీంకోర్టు పొడిగించింది. గతంలో జూన్ 15 లోగా ఆప్ ఆఫీస్‌ను ఖాళీ చేయాలని గడువు విధించిన సర్వోన్నత న్యాయస్థానం.. ఇప్పుడు ఆ గడువును ఆగస్టు 10వ తేదీ వరకు పొడిగించింది. ఢిల్లీలోని రౌస్ అవెన్యూ ఏరియాలో ఆప్ ప్రధాన కార్యాలయం ఉన్నది. అయితే ఢిల్లీ హైకోర్టుకు సంబంధించిన మౌలిక సదుపాయాలను మరింత విస్తరించేందుకు ఆప్ కార్యాలయం ఉన్న ప్రదేశాన్ని హైకోర్టుకు కేటాయించారు. ఈ నేపథ్యంలో జూన్ 15లోగా ఆప్ పార్టీ ఆఫీస్‌ను ఖాళీ చేయాలని సుప్రీంకోర్టు గడువు విధించింది. అయితే ఆప్ అభ్యర్థన మేరకు ఆ గడువును ఆగస్టు 10 వరకు పొడిగించింది. కాగా, సుప్రీంకోర్టు తీర్పుపై ఆప్ హర్షం వ్యక్తంచేసింది. సుప్రీంకోర్టు తమ కార్యాలయాన్ని ఖాళీ చేయాల్సిన గడువును మరో రెండు నెలలు పొడించడం సంతోషకర పరిణామమని ఆప్ సీనియర్ నేత సౌరభ్ భరద్వాజ్ అన్నారు. తాజా తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. తమ పార్టీ కార్యాలయం కోసం స్థలం కేటాయించాలని కేంద్రాన్ని ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. 'ఆప్ ఢిల్లీ పార్టీ అయినప్పుడు ఒక కార్యాలయం కావాల్సి వచ్చింది. ఆప్ జాతీయ పార్టీగా మారగానే మరో కార్యాలయం అవసరమైంది. దాంతో కేంద్ర ప్రభుత్వం మా కార్యాలయాలకు కావాల్సిన స్థలాలను కేటాయిస్తుందని సుప్రీంకోర్టు చెప్పింది. దాంతో మాకు స్థలాలు కేటాయించాలని మేం కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ వస్తున్నాం. కానీ ఇంతవరకు కేంద్రం మాకు ఎలాంటి స్థలాన్ని కేటాయించలేదు' అని భరద్వాజ్ వెల్లడించారు.

## యాత్రికుల బస్సుపై కాల్పులు పాక్ ఉగ్రవాదుల పనే!

**కనీసం ముగ్గురు పాల్గొన్నట్టు అంచనా**



**న్యూఢిల్లీ, జూన్ 10:** జమ్మూ-కశ్మీర్‌లోని రియాసీ జిల్లా తెర్యాత్ వద్ద యాత్రికులు ప్రయాణిస్తున్న బస్సుపై కాల్పులు జరిగిన సంఘటనలో పాకిస్థాన్ ఉగ్రవాదుల ప్రమేయం ఉందని పోలీసు వర్గాలు అనుమానిస్తున్నాయి. కనీసం ముగ్గురు విదేశీ ఉగ్రవాదులు ఇందులో పాల్గొని ఉంటారని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాంతంలో మూడు ఉగ్రవాద ముఠాలు పనిచేస్తున్నట్టు కూడా భావిస్తున్నారు. వైష్ణోదేవి దర్శనం నిమిత్తం వచ్చిన యాత్రికులు శివఖోడ్‌లో పూజలు ముగించుకొని ఆదివారం సాయంత్రం తెర్యాత్ గ్రామం వద్ద ఘాట్ రోడ్డు మీదుగా కాట్రా వెళ్తుండగా ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. తూటాలు డ్రైవర్‌కు తగలడంతో ఆయన నియంత్రణ కోల్పోయారు. దాంతో బస్సు అదుపు తప్పి లోయలో పడింది. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది మరణించగా, 33 మంది గాయపడ్డారు.

## ఆదిత్యుడు తీసిన సూర్యుడి రంగుల ఫొటోలు

**బెంగళూరు :** సూర్యుడిపై అధ్యయనం కోసం ప్రయోగించిన ఆదిత్య-ఎల్1లోని రెండు పరికరాలు ఉగ్ర సూరీడు చిత్రాలను బంధించాయని ఇస్రో తెలిపింది. భారత తొలి సోలార్ మిషన్ ఆదిత్య-ఎల్1ను ఇస్రో గతేడాది సెప్టెంబరు 2న ప్రయోగించింది. ఇది 127 రోజుల సుదీర్ఘ ప్రయాణం అనంతరం ఈ ఏడాది జనవరి 6న ఎల్-1 పాయింట్‌కు చేరుకుంది. భూమికి సుమారు 1.5 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఎల్-1 పాయింట్ నుంచి ఇది సూర్యుడిని నిత్యం పరిశీలిస్తుంది. ఈ క్రమంలో ఆదిత్య-ఎల్1 వ్యోమనౌకలో ఏర్పాటు చేసిన సోలార్ అల్ట్రా వైలెట్ ఇమేజింగ్ టెలిస్కోప్ (సూట్), విజిబుల్ ఎమిషన్ లైన్ కరోనాగ్రాఫ్ (వీఈఎల్‌సీ) ఈ ఏడాది మే నెల 8 నుంచి 15వ తేదీ మధ్య కాలంలో సూర్యుడి డైనమిక్ కార్యకలాపాలను చిత్రీకరించాయని ఇస్రో వెల్లడించింది. భూ అయస్కాంత తుఫానులకు దారితీసే కరోనాల్ మాస్ ఎజెక్షన్ (సీఎంఈ)తో సంబంధం ఉన్న అనేక ఎక్స్-క్లాస్, ఎం-క్లాస్ మంటలను ఈ రెండు పరికరాలు నమోదు చేశాయని తెలిపింది. మే 17న 'సూట్' పేలోడ్ సేకరించిన సూర్యుని చిత్రాలను ఇస్రో విడుదల చేయడంతోపాటు.. వీఈఎలసీ అందించిన పరిశీలనల వివరాలను కూడా పంచుకుంది.

# గులాబీలో అంతర్మధనం

-మొదటిపేజీ తరువాయి

ఉన్నాయంటే.. కులాల సపోర్టుతోనే. తెలుగుదేశం పార్టీకి కమ్మ, బీసీ వర్గాలు అండగా ఉంటూ వస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీకి ముస్లిం, దళితులు, రెడ్డి వర్గం వారు సపోర్టు చేస్తున్నారు. ఏపీలో వైసీపీకి రెడ్డి, ముస్లిం, దళిత వర్గాల మద్దతు ఉంది. ఏపీలో జనసేన పార్టీ కీలకంగా మారిందంటే దానికి కారణం కాపు వర్గం మద్దతు ఉండబట్టే. కేసీఆర్ కు ఈ ఓటు బ్యాంక్ రాజకీయాల సంగతి తెలియనిదేం కాదు. అందుకే ఆయన రాజకీయ పార్టీ పెట్టినప్పుడు కుల బలం చూసుకుంటే పరిమితంగా ఉంటామని..అయితే ప్రాంత భావనతో అయితే ఏకపక్ష విజయాలు వస్తాయి.. ప్రజలంతా ఓటు బ్యాంక్ అవుతారని అనుకున్నారు. అందుకే ప్రజల్లో నిగూఢంగా ఉన్నా తెలంగాణ వాదాన్ని అందుకున్నారు. ఒడిదుడుకులు అయినా ఆయన ముందుకు సాగారు. విజయంతం అయ్యారు. ఎన్నికల్లో ఆయన గెలిచిన ప్రతీ సారి తెలంగాణ సెంటిమెంటే విజయాస్త్రం. తెలంగాణ అంటే బీఆర్ఎస్ అన్నట్లుగా రాజకీయం సాగింది. అభ్యర్థి ఎవరన్నది చూసుకోలేదు..కారు గుర్తు ఉంటే చాలు ఓటేశారు. అంటే బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ .. తెలంగాణ సెంటిమెంట్ గుండె నిండా నింపుకున్నవారే. వారిలో సెంటిమెంట్ పెంచేందుకు కేసీఆర్ చేయగలిగినదంతా చేశారు. కేసీఆర్ తెలంగాణ సెంటిమెంట్ ఉన్న ప్రజలను ఓటు బ్యాంక్‌గా మార్చుకుని అనుకున్న విజయాలు సాధించారు. కానీ కులం, మతం లాగా.. ఈ తెలంగాణ సెంటిమెంట్ శాశ్వతం కాదు. అక్కడే కేసీఆర్ రాజకీయంగా తప్పటడుగు వేశారు. తెలంగాణ సాధనే లక్ష్యం అనుకున్న తర్వాత.. లక్ష్యం చేధించిన తర్వాత ఇక సెంటిమెంట్ ఉంటుందనుకోవడం అత్యాశే. అయితే కేసీఆర్ తనదైన రాజకీయంతో పదేళ్ల పాటు నెట్టుకు రాగలిగారు. ఈ పదేళ్లలో ఆయన తెలంగాణ సెంటిమెంట్ కు అతీతమైన ఓటు బ్యాంక్‌ను సృష్టించుకోవడంలో విఫలమయ్యారు. ఏ సామాజికవర్గాన్ని దగ్గర చేసుకోలేకపోయారు. కేసీఆర్ సొంత సామాజికవర్గం చాలా స్వల్పంగా ఉంటుంది. తెలంగాణ సెంటిమెంట్ లేకపోవడంతో బీఆర్ఎస్ ఘోర పరాజయాల్ని చవి చూసింది. రెడ్డి వర్గానికి కేసీఆర్ చాలా ప్రాధాన్యత ఇచ్చేవారు. ఆయన కేబినెట్‌లో ఆరుగురు రెడ్డి మంత్రులు ఉండేవారు. కానీ వారంతా సంప్రదాయకంగా కాంగ్రెస్ మద్దతుదారులు. సెంటిమెంట్ కారణంగా బీఆర్ఎస్‌కు మద్దతిచ్చారు. మళ్లీ కాంగ్రెస్ వైపు వెళ్లిపోయారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు స్థానాల్లో బీఆర్ఎస్ గెలిచిందేమీ లేదంటే.. వారు ఎంత దూరమయ్యారో అర్థం చేసుకోవచ్చు. చివరికి బీసీల్లోని ప్రధాన సామాజికవర్గాలను కూడా కేసీఆర్ కొన్ని కీలక నిర్ణయాలతో దూరం చేసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ ప్రాంతం తెలుగుదేశం పార్టీ బలంగా ఉండటానికి కారణం బీసీల మద్దతే. విప్లవాత్మక నిర్ణయాలు, బీసీ నేతలకు అవకాశాలు కల్పించడం ద్వారా ఆ పార్టీకి మద్దతుగా ఉండేలా చూసుకున్నారు. ఇప్పుడు ఆ పార్టీ ఉనికి లేకపోవడంతో బీసీ వర్గాలు ఇతర పార్టీల వైపు మళ్లాయి. వీరిని ఆకట్టుకోవడంలో కేసీఆర్ నిర్లక్ష్యాన్ని కాంగ్రెస్ అనుకూలంగా మల్చుకుంది. పై సామాజికవర్గాలు బలమైన మద్దతుదారుగా ఉండటం వల్లే 2004,2009 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచింది. రాష్ట్రవిభజన తర్వాత 2014, 2019 ఎన్నికల్లో పై సామాజికవర్గాలు బీఆర్ఎస్ కు మద్దతుగా ఉండటంతో వరుసగా రెండుసార్లు అధికారంలోకి వచ్చింది. 2023 ఎన్నికల్లో కేసీయార్ స్వయంకృతం వల్ల మెజారిటి సామాజికవర్గాలు దూరమవ్వటంతో ఫలితం రివర్స్ అయింది. కేసీఆర్ మళ్లీ బీసీలను ఆకట్టుకుని బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ గా మార్చుకునే ప్రయత్నాలు చేసి విఫలమయ్యారు. 17 పార్లమెంటు సీట్లలో ఆరుసీట్లను బీసీలకే కేటాయించారు. అయినా ఓట్లు వేయలేదు. అయితే తెలంగాణ సెంటిమెంట్ ను మళ్లీ పెంచుకుంటే.. ఓటు బ్యాంక్ పెరుగుతుంది. లేకపోతే మాత్రం.. మొదటికే మోసం వస్తుంది. ఉన్న ఓటు బ్యాంక్ మరింత కరిగిపోతుంది. అది బీఆర్ఎస్ పార్టీకి ఉనికి సమస్యను తీసుకు వస్తుంది.

# ప్రభుత్వ నిర్ణయాలే అమలు చేశా!

**ఛత్తీసగఢ్ విద్యుత్తు, యాదాద్రి, భద్రాద్రి విద్యుత్కేంద్రాలపై సొంత నిర్ణయాల్లేవ్**

**జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్‌కు తెలిపిన ట్రాన్స్‌కో మాజీ సీఎండీ ప్రభాకర్‌రావు**

**జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్‌కు తెలిపిన ట్రాన్స్‌కో మాజీ సీఎండీ ప్రభాకర్‌రావు**

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఛత్తీసగఢ్ విద్యుత్తు, యాదాద్రి, భద్రాద్రి విద్యుత్కేంద్రాలకు సంబంధించిన అంశాల్లో తాను స్వయంగా నిర్ణయాలు తీసుకోలేదని ట్రాన్స్‌కో, జెన్‌కో మాజీ సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు చెప్పారు. నాటి పరిస్థితులు, ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగానే ముందుకు వెళ్లామని తెలిపారు. విద్యుత్తు అంశాలపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి ఎదుట హాజరైన ప్రభాకర్‌రావు వివరణ ఇచ్చారు. ఆయనతో పాటు ఇంధన శాఖ మాజీ ముఖ్యకార్యదర్శి సురేశ్ చందా కూడా హాజరయ్యారు. కాంపిటీటివ్ బిడ్డింగ్ ప్రక్రియను అనుసరించకుండా నామినేషన్ పద్ధతిలో ఛత్తీసగఢ్ డిస్కంల నుంచి 1000 మెగావాట్ల విద్యుత్తు కొనుగోళ్లకు 2014లో ఒప్పందం చేసుకోవడంతో పాటు అవసరానికి మంచి 2000 మెగావాట్ల విద్యుత్తు కారిడార్ (అంతర్రాష్ట్ర విద్యుత్తు సరఫరా లైన్లు) కోసం పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (పీజీసీఎల్)కు దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ డిస్కమ్‌లను నాటి ప్రభుత్వం ఏకపక్షంగా ఆదేశించడం వల్ల ఆర్థిక నష్టం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది.



# నెలాఖరులోగా కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలు?

-మొదటిపేజీ తరువాయి

వరకు పెంపుదల ఉండొచ్చని విశ్వసనీయ వర్గాల సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి ఈ ఏడాది మే 16న స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. శాఖ ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం పెంచాలని స్పష్టం చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.18,500 కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకోగా.. రూ.14,295 కోట్లు వచ్చింది. లక్ష్యంలో 77 శాతం మాత్రమే ఆదాయం రావడంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. చాలా చోట్ల భూముల మారెట్ విలువకు, క్రయ విక్రయ ధరలకు భారీ తేడా ఉన్నదని, కాబట్టి భూముల విలువ, స్టాంపు డ్యూటీని సవరించాలని ఆదేశించారు. ఏయే ప్రాంతాల్లో ధరలను సవరించాలి, వ్యవసాయ భూములు, ఖాళీ స్థలాలు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్లలో.. వేటికి ఎంత సవరించాలనేది శాస్త్రీయంగా నిర్ధారణ జరగాలని స్పష్టం చేశారు. ఈ మేరకు స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అధ్యయనం జరిపారు. మార్కెట్ విలువకు అనుగుణంగా ఏయే ప్రాంతాల్లో ఎంత మేర పెంచవచ్చో నివేదికలు సిద్ధం చేశారు. ఇతర రాష్ట్రాల్లో పరిస్థితి ఎలా ఉన్నదో అధ్యయనం చేసి రెవెన్యూ శాఖ మంత్రికి వివరాలు అందజేసినట్టు తెలిసింది. వీటిని పరిశీలించిన అనంతరం భూముల విలువను ఎంత మేర సవరించాలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నది.

**పెంచిన ధరలతోనే.. బడ్జెట్ అంచనాలు?**

ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌కు కసరత్తులు ప్రారంభించింది. శాఖల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో స్టాంపులు, రిజిస్ట్రేసన్ల శాఖలో పెంచబోయే ధరలకు అనుగుణంగానే అంచనాలు రూపొందించాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. గత ఆర్థిక సంవత్సరం రూ.18500 కోట్ల ఆదాయ లక్ష్యం కాగా.. ఈసారి రూ.20-21వేల కోట్ల మధ్యలో అంచనాలు ఉండొచ్చని చెబుతున్నారు. స్టాంపులు రిజిస్ట్రేషన్ల ద్వారా గతేడాదితో పోల్చితే కనీసం 40 శాతం అదనపు ఆదాయం సాధించేలా ప్రణాళికలు రూపొందించినట్టు తెలుస్తున్నది.

# ఇక రేవంత్ దూకుడు

**హైదరాబాద్ :** ఎన్నికల కోడ్ ముగియంటంతో తెలంగాణ ప్రభుత్వం పాలనపై దృష్టి సారించింది. గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న అంశాలలో ప్రాధాన్యతల ఆధారంగా ఒక్కొక్క దాని మీదా ముఖ్యమంత్రి, మంత్రులు దృష్టి సారిస్తున్నారు. సామాన్యులు తమ సమస్యలను చెప్పుకునేందుకు ఉద్దేశించిన ప్రజావాణి కార్యక్రమాన్ని శుక్రవారం తిరిగి ప్రారంభించారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావటంతో గతంలో వాయిదా పడిన టీచర్ల బదిలీలు, ప్రమోషన్ల ఫైలును ఒకటి రెండు రోజుల్లో సీఎం క్లియర్ చేయనున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సామాన్యులకు మెరుగైన సేవలు అందేందుకు 5 వేలకు పైగా ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం సిద్ధమవుతోంది. అలాగే రైతు రుణమాఫీ, ధరణి వంటి అంశాలతో బాటు రూ. 850 కోట్లతో రాష్ట్రంలోని రోడ్ల నిర్మాణం, రేషన్ షాపుల ద్వారా నిత్యావసరాల సరఫరా వంటి ప్రాధాన్యతా అంశాలపై ప్రభుత్వం వడివడిగా నిర్ణయాలు తీసుకోనుంది.రేవంత్ రెడ్డి సీఎం కాగానే.. ప్రజలు తమ సమస్యలు నేరుగా ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గతంలో కేసీఆర్ అధికారిక నివాసంగా ఉన్న ప్రగతి భవన్‌ను ప్రజలకు అంకితం చేస్తూ దానికి జ్యోతిబా పూలే పేరు పెట్టి ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రజలు నేరుగా తమ సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పించారు. కోడ్ కారణంగా తిరిగి ఈ కార్యక్రమం శుక్రవారం నుంచి మొదలైంది. పెద్ద సంఖ్యలో ప్రజలు క్యూలు కట్టి తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు అందిస్తున్నారు. ప్రజావాణి కార్యక్రమానికి ఇన్‌ఛార్జ్‌గా రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే.తొలుత.. ఈ జూన్ 12న విద్యా సంవత్సరం ప్రారంభం కావటంతో శుక్రవారం ప్రభుత్వం టీచర్ల పదోన్నతులు, బదిలీలకు నోటిఫికేషన్ జారీ చేసింది. విద్యాశాఖ ముఖ్యమంత్రి వద్దే ఉండటంతో ఇప్పటికే అధికారులు బదిలీలు, ప్రమోషన్ల ఫైలును ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపటం, శుక్రవారం దానికి ఆమోదముద్ర పడటంతో షెడ్యూల్ విడుదలైంది. నిజానికి 2023 ఆగస్టు, సెప్టెంబరు నెలలోనే బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా, పదోన్నతుల విషయంలో టెట్ నిబంధన తప్పనిసరి అంటూ హైకోర్టు తీర్పు రావటం, జీవో 317 కారణంగా ఇతర జిల్లాల టీచర్లు రాజధాని పరిధిలోని రంగారెడ్డిజిల్లాకే రావటం ఎక్కువ కావటంతో స్థానికులమైన తమకు నష్టం జరుగుతోందని ఇక్కడి టీచర్లు హైకోర్టును ఆశ్రయించటంతో అప్పట్లో ఈ బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ అరాకొరాగా జరిగింది. తీర్పు వచ్చేనాటికి వివాదం లేని బదిలీలు, ప్రమోషన్లు మాత్రం పూర్తయ్యాయి. అసంపూర్తిగా మిగిలిన ఈ ప్రక్రియను రెండు రోజుల్లో ఆరంభించి పూర్తిచేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో 6 వేలమంది సెకండ్ గ్రేడ్ టీచర్లు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందనుండగా, 2400 మంది హెడ్మాస్టర్లు కానున్నారు. గతంలో హైకోర్టు ఇచ్చిన మరో తీర్పును అనుసరించి 8,630 మంది భాషా పండితులకు, 1,819 మంది పీఈటీలు కూడా ఈసారి స్కూల్ అసిస్టెంట్లు కానున్నారు.

**వైద్య, ఆరోగ్య శాఖలో కొలువులు..**

వైద్యవిద్య, వైద్యవిధానపరిషత్, ప్రజారోగ్యశాఖలో 5348 వేల ఉద్యోగాలను భర్తీ చేయాలని రెండున్నర నెలల క్రితమే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించగా, ఈ ఉద్యోగాలకు ఆర్థిక శాఖ అనుమతి కూడా లభించింది. అయితే, కోడ్ కారణంగా ఇది నిలిచిపోయింది. వైద్య, ఆరోగ్యసేవల రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్‌ఎస్‌ఆర్‌బీ) ద్వారా పోస్టులు భర్తీ కానున్నాయి. కొత్త వైద్యకళాశాలలు రావడంతో పాటు వైద్య, ఆరోగ్య సేవలు జాప్యం లేకుండా పూర్తిస్థాయిలో అందించాలని జాతీయ వైద్యమండలి (ఎన్‌ఎంసీ) నిబంధనలు కఠినతరం చేయడంతో ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా ఈ ఉద్యోగాల భర్తీని చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మొత్తం ఉద్యోగాల్లో 3235 పోస్టులు వైద్యవిద్య డైరెక్టరేట్ పరిధిలో ఉండగా, మిగిలిన 2,113 ఉద్యోగాలు ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ, వైద్య విధాన పరిషత్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్, ఔషధ నియంత్రణ మండలి (డీసీఏ), ఆయుష్, ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి పరిధిలో ఉన్నాయి. వీటిలో 1610 వైద్యుల పోస్టులు, 596 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, 1014 సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, 764 ల్యాబ్ టెక్నీషియన్, 191 ఫార్మసిస్టులు, 85 ఏఎన్ఎంల పోస్టులున్నాయి.పంద్రాగస్టులోగా ఒకేసారి రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేసే దిశగా రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారు. తెలంగాణలో సుమారు 30 లక్షల మందికి పైగా రుణమాఫీ చేయాల్సి ఉండగా, సగటున దీనికి రూ. 35 వేల కోట్లు అవసరం అవుతాయని ప్రభుత్వం ఇప్పటికే ఒక అంచనాకు వచ్చింది. రాష్ట్ర ఆర్థిక శాఖ ఇప్పిటికే తమ ఆలోచనను ఆర్బీఐ, కేంద్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకురావటమే గాక రుణమాఫీ కార్పొరేషన్ ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తోంది. ముందుగా బ్యాంకులను ఒప్పించి, వారి రుణాలను ప్రభుత్వ ఖాతాకు బదలాయించి, బ్యాంకుల నుంచి రుణమాఫీకి సరిపడా మొత్తాన్ని తీసుకుని, ఆ బాకీని వడ్డీతో సహా నెలవారీ కిస్తీలుగా కట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ క్రమంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, వాణిజ్య పన్నుల శాఖల ద్వారా వచ్చే ఆదాయాపు లెక్కలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. అదే విధంగా, తెలంగాణలోని మొత్తం వ్యవసాయ భూమిలో దాదాపు 45 శాతం మేర సాగులోనే లేదని, అయినా రైతుబంధు సాయాన్ని గత ప్రభుత్వం విడుదల చేసిందని ప్రభుత్వం నిర్ధారణకు వచ్చింది. ఈ వృధాను అరికట్టటం, వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి రైతులకు అందించాల్సిన పంట సాయం, సబ్సిడీ విత్తనాలు, పనిముట్లు, సాగునీటి సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్ల మీద కూడా ప్రభుత్వం దృష్టి సారించనుంది.రైతులు పండించే పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి, రేషన్ దుకాణాల ద్వారా వాటిని తక్కువ ధరకే అందించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. కేసీఆర్ హయాంలో బియ్యంతో బాటు ఒకటి రెండు సరకులకే పరిమితం కాగా, గత కాంగ్రెస్ ప్రభుత్వాల మాదిరిగి వీలున్నన్ని ఎక్కువ నిత్యావసరాలను సరఫరా చేయాలని, తద్వారా సామాన్యులపై నిత్యావసరాల భారాన్ని తగ్గించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. దీనిపై పౌరసరఫరా శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.త ప్రభుత్వ హయాంలో అమల్లోకి వచ్చిన ధరణిని రద్దుచేసి, భూరికార్డులను పారదర్శకంగా అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం 'భూమాత' అనే వ్యవస్థను తీసుకురానుంది. దీనిపై పార్లమెంటు ఎన్నికలు ముగిసిన రెండవ రోజే ముఖ్యమంత్రి సచివాలయంలో రెవెన్యూ ఉన్నతాధికారులతో సమిాక్ష నిర్వహించారు.

## టీపీసీసీకి త్వరలో కొత్త అధ్యక్షుడు!




-మొదటిపేజీ తరువాయి

పర్యటనలో పార్టీ పెద్దలతో పీసీసీకి కొత్త అధ్యక్షుడు, మంత్రివర్గ విస్తరణపై చర్చించారు. మంత్రివర్గ విస్తరణ కంటే పీసీసీ అధ్యక్షుడి నియామకంపైనే అధిష్ఠానం ప్రస్తుతం దృష్టి సారించడంతో ఇప్పట్లో మంత్రివర్గ విస్తరణ లేకపోవచ్చని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ సాధించిన ఫలితాలపై పూర్తిస్థాయి సమీక్ష జరిపిన తర్వాత వాటి ఆధారంగా మంత్రివర్గ విస్తరణ ఉంటుందని, అధిష్ఠానం ఆ దిశగానే ఆలోచిస్తున్నట్లు సమాచారం.

**ఎంపికపై అధిష్ఠానం తర్జన భర్జన**

టీపీసీసీ కొత్త అధ్యక్షుడి నియామకంపై ఆ పార్టీ అధిష్ఠానం తర్జన భర్జన పడుతున్నది. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయాన్ని మాత్రమే అడిగి తెలుసుకొని, నిర్ణయం తమకు వదిలేయాల్సిందిగా స్పష్టం చేసినట్టు తెలిసింది. ప్రస్తుత రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా దీటుగా ఎదుర్కొనే నేతకే పీసీసీ పగ్గాలు అప్పగించాలన్నది పార్టీ పెద్దల యోచనగా తెలుస్తున్నది. సీఎం, డిప్యూటీ సీఎం రెండు కీలకమైన పదవులు ఓసీ, ఎస్సీకి ఇవ్వడంతో పీసీసీ పగ్గాలు బీసీ సామాజిక వర్గాలకు ఇచ్చే అవకాశం ఉందన్నది రాష్ట్ర నాయకులు మొన్నటిదాకా అంచనా వేశారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లొచ్చిన తర్వాత ఈ పదవి తిరిగి రెడ్డి సామాజికవర్గానికి దక్కినా ఆశ్చర్యం లేదని తాజాగా కాంగ్రెస్ వర్గాల్లో వినిపిస్తున్నది. పీసీసీ మాజీ అధ్యక్షుడు, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేరు కూడా అధిష్ఠానం సీరియస్‌గా పరిశీలిస్తున్నట్టు ఆ వర్గాల సమాచారం. అలాగే కర్ణాటక ఫార్ములా ప్రకారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను పీసీసీ అధ్యక్షుడిగా నియమిస్తే ఎలా ఉంటుందనే దిశగా కూడా అధిష్ఠానం ఆలోచిస్తున్నట్టు తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి బీసీ నేతకు ఇవ్వాలని ప్రతిపాదన చేసినట్టు విశ్వసనీయ సమాచారం. దీంతో త్వరలో టీపీసీసీకి కొత్త అధ్యక్షుడు వచ్చే అవకాశం ఉన్నది.

## రుణమాఫీకి విధివిధానాలు!



-మొదటిపేజీ తరువాయి

చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థికశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, డైరెక్టర్ గోపి ఇతర అధికారులు పాల్గొన్నారు

**నిధులు, పథకాల సాధనకు కృషి చేయాలి**

తెలుగు రాష్ట్రాల కేంద్రమంత్రులకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్

ఏపీ, తెలంగాణల నుంచి కేంద్రమంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాస వర్మలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విభజన చట్టంలోని అంశాల అమలు, కేంద్రం నుంచి తెలుగు రాష్ట్రాలకు రావాల్సిన నిధులు, పథకాలు, ప్రాజెక్టుల సాధనకు కృషి చేయాలని కోరారు. ఈమేరకు ఆయన సోమవారం తన 'ఎక్స్' ఖాతాలో ట్వీట్ చేశారు.

## విద్యపై ఖర్చులోఎక్కువ భాగం టీచర్ల జీతాలకే

-మొదటిపేజీ తరువాయి



దీనిని తాము ఖర్చుగా భావించడం లేదని, విద్యపై పెట్టే పెట్టుబడి సమాజానికి మేలు చేస్తుందని అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ప్రభుత్వ బడి పిల్లలు-ప్రతిభ గల పిడుగులు' పేరుతో నిర్వహించిన కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్కారు బడిలో చదివి పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రయివేట్ పాఠశాలలతో పోటీపడి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాణించడం ప్రభుత్వానికి గర్వకారణమని, ఇలాంటి కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తే బాగుండేదని, వందేమాతరం ఫౌండేషన్ తమ బాధ్యతను గుర్తు చేసిందని అన్నారు. ఎంతోమంది గొప్ప గొప్ప నాయకులు సైతం ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నారని చెప్పారు. ప్రధాని మోదీ, చంద్రబాబు, తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన తాను కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నామని చెప్పారు. ఐఎఎస్, ఐపీఎస్ అధికారుల్లో 90% మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారేనని వివరించారు.

**విద్యాకమిషన్ ఏర్పాటు చేస్తాం**

మారిన పరిస్థితులకు అనుగుణంగా సిలబస్‌ను మార్చేందుకు త్వరలోనే విద్యాకమిషన్‌ను ఏర్పాటు చేస్తామని రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్యా కమిషన్ విద్యావ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం విద్య, వ్యవసాయాన్ని ప్రాధాన్య అంశాలుగా తీసుకున్నదని, వ్యవసాయ కమిషన్‌ను సైతం త్వరలో ఏర్పాటుచేస్తామని తెలిపారు. గ్రామీణ పాఠశాలలపై నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. సింగిల్ టీచర్ పాఠశాలలను మూసివేయబోమని స్పష్టంచేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని మహిళాసంఘాలకు అప్పగిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాశ్‌రెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, కార్యదర్శి మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఖ

# ప్రజావాణికి వెల్లువెత్తిన ఫిర్యాదులు




**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత సంగారెడ్డి కలెక్టరేట్లో నిర్వహించిన మొదటి ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణికి 48 ఫిర్యాదులు వచ్చాయి. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా కోడ్ అమలులో ఉండడంతో తాత్కాలికంగా వాయిదా వేసిన ప్రజావాణిని సోమవారం నుంచి మళ్ళీ పునరుద్ధరింపజేశారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను వెంట వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా, జిల్లాలో ప్రారంభం కాని అభివృద్ధి పనులు, ఎన్ఆర్జీఎస్ పనులు, పెండింగ్లో ఉన్న పనులను మొదలుపెట్టాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను మండల ప్రత్యేక అధికారులు విధిగా తనిఖీలు చేయాలన్నారు. ఆదర్శ పాఠశాల పనులు ఫోటోలు తీసి పంపించాలని ప్రత్యేక అధికారులను ఆదేశించారు. తనిఖీలు నిర్వహించేటప్పుడు జరిగిన పనులు మిగిలి ఉన్న పనులు బడ్జెట్ వివరాలు సమర్పించాలన్నారు ఇంకా పనులు మిగిలి ఉంటే అమ్మ

**ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మొదటి ప్రజావాణి**
**అమ్మ ఆదర్శ పాఠశాలల మరమత్తు పనులు వేగవంతం చేయాలి**
**అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు చేవెంటనే చేపట్టాలి**
**పెండింగ్ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి.**
**జిల్లా కలెక్టర్ క్రాంతివల్లూరు**

ఆదర్శ పాఠశాలలో టాయిలెట్స్, కాంపౌండ్ వాల్సు, కరెంటు వంటి అత్యవసరమైన పనులు గుర్తించి పూర్తి చేయాలన్నారు. ఈనెల 12న బడులు పునః ప్రారంభం అవుతున్నాయని ప్రారంభం రోజు నుండి విద్యార్థులు కొత్త యూనిఫామ్ లు కొత్త పుస్తకాలను విధిగా అందించాలన్నారు. ప్రతి గ్రామంలో స్కూలు ప్రారంభోత్సవం నాడు ప్రజాప్రతినిధులు,అమ్మ ఆదర్శ పాఠశాల సభ్యులు, ఉపాధ్యాయులు , పాఠశాలలో కొత్తగా చేరే విద్యార్థులకు వినూత్న స్వాగత కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని ప్రభుత్వం నిషేధించినట్లు ఉత్తర్వులు జారీ చేసిందని, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వ కార్యాలయాలలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించినట్లు తెలిపారు. ప్రతి కార్యాలయంలో ప్లాస్టిక్ నిషేధ ఆజ్ఞలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని హెచ్ఓడీలను ఆదేశించారు. అధికారిక కార్యక్రమాలు, సమావేశాలలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధ ఆజ్ఞలను అమలు చేయాలన్నారు. మండలాలు గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో అమలు చేయాలని ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఖమ్మం కోలుకోనేది ఎలా

**ఖమ్మం :** ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి భారీనా నష్టం కలిగింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఉమ్మడి జిల్లాలో పదికి పది స్థానాలు కాంగ్రెస్ ఖాతాలో ఉన్నాయి.. అయితే ఇప్పుడు ఎంపీ ఎన్నికల్లో ఖమ్మం సిట్టింగ్ సీటును కోల్పోయింది. రికార్డు మెజార్టీ తో కాంగ్రెస్ విజయం సాధించగా.. బీఆర్ఎస్ కోటకు బీటలు పడడంతో.. ఆ పార్టీ ఓటు బ్యాంక్ చెల్లా చెదురై కాంగ్రెస్, బీజేపీ క్రాస్ అయ్యాయి. జిల్లాలో పార్ట్ పరిస్థితి చూసి బీఆర్ఎస్ కేడర్ నైరాశ్యంలో మునిగిపోయారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా మరోసారి కాంగ్రెస్ కంచుకోట అని నిరూపించింది. లోక్ సభ ఎన్నికల్లో రికార్డు మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి రఘురాం రెడ్డి ఘన విజయం సాధించారు. అయితే ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ దారుణంగా దెబ్బతింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ తారుమారు అయ్యింది. కేవలం ఆరు నెలల్లోనే ఆ పార్టీ గ్రాఫ్ పడిపోయింది. ఖమ్మం నియోజక వర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్కు 86,635 ఓట్లు రాగా ఇప్పుడు ఎంపీ ఎన్నికల్లో 38,889 ఓట్లు మాత్రమే వచ్చాయి. సగానికి పైగా ఓటు బ్యాంక్ పడిపోయింది. ఇక్కడ బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ భారీగా బీజేపీకి క్రాస్ అయ్యింది. పాలేరు నియోజక వర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో 71710ఓట్లు, ఎంపీ ఎన్నికల్లో 58,388 ఓట్లు వచ్చాయి.ఇక మధిర అసెంబ్లీ పరిధిలో 73,518, ఎంపీ ఎన్నికల్లో 50617 ఓట్లు వచ్చాయి. వైరా, సత్తుపల్లి, అశ్వరావుపేట, కొత్తగూడెం ఇలా ఏడు నియోజక వర్గాల్లోనూ బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ పడిపోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమి తర్వాత బీఆర్ఎస్ మరింత చతికిల పడింది. బీఆర్ఎస్ నేతలు బలం చాటుకునేందుకు ప్రయత్నం చేసినా.. ఫలితం లభించలేదు. కాంగ్రెస్కి భారీ



మెజార్టీ రావడానికి ప్రధాన కారణం లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ పడిపోవడంతో పాటు బీఆర్ఎస్ ఓటు బ్యాంకును బీజేపీ క్రాస్ చేసింది. ఇక లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్కి 2,99,082 ఓట్లు రాగా, గత అసెంబ్లీ ఎన్నికల్లో 4,67,639 ఓట్లు వచ్చాయి. దీంతో బీఆర్ఎస్ 1,68,557 ఓట్లు కోల్పోయింది. ఇందులో లక్షకు పైగా ఓట్లు బీజేపీకి క్రాస్ అయ్యాయి.ఇదిలా ఉంటే ఖమ్మం జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కేవలం భద్రాచలంలో మాత్రమే గెలిచింది. మిగతా 9 స్థానాల్లో కాంగ్రెస్, సీపీఐ అభ్యర్థులు విజయం సాధించారు. అయితే భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు కూడా ఆ తర్వాత కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీంతో ఇప్పుడు ఖమ్మంలో మొత్తం 10 స్థానాలు కాంగ్రెస్ ఖాతాలోనే ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం నుంచి తేరుకోక ముందే లోక్ సభ ఎన్నికల్లో గట్టి దెబ్బ తగిలింది. దీంతో జిల్లాలో బీఆర్ఎస్ పరిస్థితి ఏంటనే చర్చ నడుస్తోంది. ఇక కేడర్ పూర్తి నైరాశ్యంలో మునిగి పోయింది.

# మెదక్పై కాంగ్రెస్ ఆశలు

**మెదక్ :** మొన్నటి వరకు ఆ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి అంతంత మాత్రమే.. కానీ ఇటీవల జరిగిన ఎంపీ ఎన్నికల్లో ఆపార్టీ గ్రాఫ్ కొంత మెరుగుపడిందని చెప్పుకుంటున్నారు స్థానిక నేతలు. పూర్వ వైభవం కోసం ఆ పార్టీ నేతలు బాగానే కష్టపడుతున్నట్లు తెలుస్తోంది. మెదక్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా పుంజుకుంటోంది. 2019 లోక్సభ ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఎన్నికల్లో లక్షా 52 వేల ఓట్లు కాంగ్రెస్ పార్టీకి పెరిగాయి. మెదక్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు 2.8 శాతం ఓట్ల తేడాతో బీజేపీ నుంచి గట్టి పోటీ ఇచ్చారు. కౌంటింగ్ మొదటి రౌండ్ నుంచి పోటీ పడుతూ నువ్వా నేనా అన్న ఉత్కంఠ కొనసాగింది. లెక్కింపు పూర్తయ్యే సరికి రఘునందన్ రావ్ కేవలం 39,139 ఓట్ల స్వల్ప మెజారిటీతోనే బయటపడ్డారు. కిందటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్?కు లోక్ సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు సెగ్మెంట్లలో 4,20,881 ఓట్లు రాగా ఈ లోక్ సభ ఎన్నికల్లోనూ 4,27,899 ఓట్లు వచ్చాయి. మరో వైపు మూడు లోక్ సభ ఎన్నికల్లో మాదిరిగానే ఈ సారి ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ క్యాండిడేట్ను మార్చింది. ఎన్నికలకు కొద్ది రోజుల ముందు బీఎస్పీ నుంచి కాంగ్రెస్?లో చేరిన నీలం మధుకు టికెట్ కేటాయించింది.లోక్ సభ ఎన్నికల్లో విజయం సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగిన కాంగ్రెస్ తనదైన ప్రభావాన్ని చూపింది. కాంగ్రెస్ ప్రత్యర్థి పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్?లు ఓసీ సామాజికవర్గానికి చెందిన అభ్యర్థులను బరిలోదించింది. దీనిని దృష్టిలో ఉంచుకుని బీసీ సామాజిక వర్గానికి చెందని అభ్యర్థి నీలం మధును ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ బరిలోదించింది. ఇది కూడా కాంగ్రెస్ పార్టీకి ఓ రకంగా ప్లేస్ అయ్యిందని చెప్పుకుంటున్నారు నేతలు. లోక్సభ నియోజకవర్గ పరిధిలోని ఓటర్లలో 50 శాతానికి పైగా బీసీలే ఉండటం, కాంగ్రెస్ అభ్యర్థి ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కావడం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో ఈ సారి లోక్ సభ ఎన్నికల్లో ఖచ్చితంగా




విజయం సాధిస్తామన్న ధీమా పార్టీ క్యాడెర్లో కనిపించింది. దీంతో ఎన్నికల ప్రచారం జోరుగా నిర్వహించింది కాంగ్రెస్ పార్టీ. మెదక్ లోక్ సభ నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ పుంజుకోవడానికి పలు అంశాలు దోహదపడ్డాయి. ఆరు గ్యారెంటీల అమలు దిశగా చర్యలు చేపట్టడం, ఆగష్టు 15లోపు రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇవ్వడంతో ప్రజలు, రైతులు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపారంటున్నారు పార్టీ నేతలు. అంతేకాకుండా పలు చోట్ల బీఆర్ఎస్ పార్టీ ఓట్లు క్రాస్ అయి కాంగ్రెస్?కు పడ్డాయంటున్నారు. ముఖ్యంగా రూరల్ ఏరియాల్లో కాంగ్రెస్ పార్టీకి సైలెంట్ ఓటింగ్ బాగా ఉందని.. ఇదే ఉత్సాహాన్ని కొనసాగించి, మెదక్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని భావిస్తోంది. దీని కోసం ఇప్పటి నుంచే క్యాడర్లో బలం నింపుతూ ముందుకు సాగుతున్నట్లు చెబుతున్నారు సీనియర్ లీడర్లు. ఈసారి కచ్చితంగా మెదక్ తమ ఖాతాలో వేసుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## నూతన ఎస్సై ని సన్మానించిన సీపీఎం నాయకులు




**వాస్తవ నేస్తం,భీంపూర్:** ఆదిలాబాద్ టూ టౌన్ నుండి భీంపూర్ మండల ఎస్సై గా బాధ్యతలు చేపట్టిన మొహమ్మద్ ఖలీల్ ను సోమవారం సీపీఎం మండల నాయకులు శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై ఖలీల్ మాట్లాడుతూ గుట్కా,మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.నేరాల నియంత్రణకు అందరి సహాయ సహకారాలు అవసరం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ ధోని పెళ్లి స్వామి,నాయకులు గోవర్ధన్,తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

**బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని జాతీయ రహదారిపై గ్రామస్తుల ధర్నా**
**జాతీయ రహదారిపై స్తంభించిపోయిన ట్రాఫిక్**
**తీవ్ర ఇబ్బందులు పడ్డ వాహనదారులు**



**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** నేరడిగొండ మండలంలోని రోల్ మామడ గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని సంక్రాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ రాజు కేఎన్ఆర్ సంస్థలో ట్రాక్టర్ డ్రైవర్ గా పని చేస్తున్నాడు. జాతీయ రహదారి మధ్యలో నాటిన మొక్కలకు మంగళవారం నీళ్లు పడుతున్న క్రమంలో లారీ ఢీకొనడంతో ట్రాక్టర్ డ్రైవర్ రాజు అక్కడికి అక్కడే స్పాట్ డెత్ అయ్యాడు. ఇట్టి విషయాన్ని తెలుసుకున్న గ్రామస్తులు ఒకేసారి జాతీయ రహదారి పైకి చేరుకొని కుటుంబ పెద్దదిక్కును కోల్పోయిన బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, రూ.20 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించాలని జాతీయ రహదారిపై నిరసన చేపట్టారు దీనితో జాతీయ రహదారిపై నాలుగు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. ట్రాఫిక్ జామ్ అవ్వడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొను గ్రామస్తులకు నచ్చజెప్పి కూడా ఫలితం లేకుండా పోయింది. చివరకు నియోజకవర్గ ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించినట్లు గ్రామస్తులు తెలిపారు.



## కోనసీమలో మంత్రి పదవులపై హైకమాండ్ వద్ద పైరవీలు

**అంబెడ్కర్ కోనసీమ జిల్లాలో మంత్రి పదవులపై పోటీపడుతున్న పలువురు ఎమ్మెల్యేలు..**

**అమలాపురం :** ఎన్నికల ఫలితాల తర్వాత నియోజకవర్గంలో అందుబాటులో లేకుండా విజయవాడ,హైదరాబాద్ లోనే వుంటూ మంత్రి పదవి కోసం పలువురు ఎమ్మెల్యేలు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో ఏడు కు ఏడు స్థానాలలో టీడీపీ,బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులు గెలిచిన విషయం తెలిసిందే. కులాలు, సీనియారిటీ వారిగా మంత్రి పదవి నాకు వస్తుంది అంటే నాకు వస్తుంది అంటూ ధీమా వ్యక్తం చేస్తున్న పలువురు ఎమ్మెల్యేలు. మరో రెండు రోజుల్లో చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో విజయవాడ, హైదరాబాద్ లోనే మకాం వేసి పలువురు ఎమ్మెల్యేలు లాబీయింగ్ చేసుకుంటున్నారు. ఎస్సీ సామాజిక వర్గం నుండి సీనియర్ నేత అమలాపురం టీడీపీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కు మంత్రి పదవి అంటూ జోరుగా ప్రచారం జరుగుతోంఇ. కాపు సామాజిక వర్గం నుండి కొత్తపేట టీడీపీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు దాదాపు మంత్రి పదవి ఖరారు అయింది, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కి కూడా మంత్రి పదవి అంటూ జిల్లలో జోరుగా ప్రచారం జరుగుతోంది. పార్టీ అధిష్టాన పెద్దల వద్ద మంత్రి పదవి కోసం ఎమ్మెల్యేలు విశ్వ ప్రయత్నులు చేస్తున్నారు.

## కేంద్ర మంత్రులుగా కిషన్‌రెడ్డి, బండి సంజయ్..

**తెలుగు రాష్ట్రాల నుంచి ఐదుగురు మంత్రులు**

**హైదరాబాద్ :** కేంద్రంలో నరేంద్రమోడీ సారథ్యంలో ఏర్పడిన కొత్త మంత్రి వర్గంలో తెలంగాణ, ఆంధ్రపదేశ్ రాష్ట్రాల నుంచి ఐదుగురు ఎంపిలు కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్లో ఆదివారం అట్టహాసంగా జరిగిన ప్రమాణస్వీకారోత్సవంతో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వీరితో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయించారు. తెలంగాణ రాష్ట్రంలో సికింద్రాబాద్ పార్లమెంటు స్థానం నుంచి విజయం సాధించిన జి.కిషన్ రెడ్డి, కరీంనగర్ నుంచి గెలుపొందిన బండి సంజయ్ కేంద్ర మంత్రులుగా హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు.ధ్రప్రదేశ్ నుంచి ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం పార్టీ నుంచి శ్రీకాకుళం ఎంపిగా గెలిచిన కింజరపు రామ్మోహన్ నాయుడు ఇంగ్లీషులో ప్రమాణ స్వీకారం చేశారు. గుంటూరు పార్లమెంటు నియోజకవర్గంలో విజేతగా నిలిచిన పెమ్మసాని చంద్రశేఖర్ సహాయ మంత్రిగా, బిజెపి నుంచి నరసాపురం పార్లమెంటు సభ్యుడిగా గెలిచిన భూపతిరాజు శ్రీనివాస్ వర్మ కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

## తలసానిని పరామర్శించిన హరీష్ రావు

**హైదరాబాద్ :** మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు తలసాని శంకర్ యాదవ్ అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం మరణించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు,శంకర్ యాదవ్ భౌతిక కాయానికి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com